## తెనుగుందనము

బందరెక్కడ? బొబ్బిలెక్కడ?

బందరులో బొబ్బిలిపాట అంటే బందరువాస్తవ్యులకా యొడలిపులకరింపు, ఆ గర్వము, ఆ యుత్సాహము. రానేమిటికి?

50,60 మందిం కూర్చుని వింటున్నాం. పాటగాడు తంబుర చేతబట్టి వాయిస్తూ బొటనవ్రేల కంచుకడియములు గలగల మనిపిస్తూ నడుమ నడుమ చక్ చక్ అని కేకవేస్తూ పెద్దబొబ్బిలి మహారాజు కథ వినిపిస్తున్నాడు. మద్దెల అంగుదారుడు టిమ్ టిమ్, ధమ్ ధమ్ కలిసిన యొకానొక అవ్యక్తధ్వానముతో వానికి తోడై కథాసరళి నంతనూ దారముతీసినట్టు పాడిగించి పొదలించు చున్నాడు.

తొలితొలి కోడిపందాలు, ధర్మారాయుని రాయబారం, దుబాసి లక్ష్మయ్య తెనిగింపు, భేరీ రామక్క యుద్ధం, వెంగళ్ళాయ రంగారాయ, పాపారాయుల శౌర్యం సమస్తమున్నూ భారతగాథ యొక్క జూదం, కృష్ణరాయబారం, భీమార్జునాశ్వద్ధామల శూరత్వాన్నిపోలి గాలి యూగించినట్టు మా హృదయాల్ని యూగించేసింది.

అంతలో సమాప్తి పొందలేదు. సశేషంలాగింకా పాటగాని మొగమందు, వినువారి చెవులందు తాండవిస్తూంది ఒక విషయం.

దుబాసి లక్ష్మయ్యది బందరుదగ్గరగల యొక చిన్న పల్లె యట. ఆ పల్లెపేరుచెప్పి దుబాసి లక్ష్మయ్య తుదకు బొబ్బిలి నుంచి వచ్చివచ్చి బందరు ప్రాంతమందు తన ప్రాణాలు గోలుపోయిన విధానం పాడునంతవఱకూ నాటికథ కంత్యశ్రుతి రక్తి కట్టలేదు.

నేనప్పుడనుకొన్నాను. "బందరుకూ, బొబ్బిలికీ సంబంధమున్నది. బందరులో బొబ్బిలిపాట వినుటయం దొకానొక స్థానిక విశేషం కలదూ" అని.

తెల్లవారగట్ల వేగుచుక్క పొడిచింది, మేము కధవినుట ముగించి నింగివైపు చూచేసరికి ఓహెూ మగవానికి మగతనమెట్టిదో తెనుగుపుస్తకానికి తెనుగుందన మట్టిది! తెనుగుందనము వెల్లడింపని వ్రాతకు తెనుగునగరమ్ముల తెనుగు పట్టణమ్ములతెనుగు కుప్పమ్ముల నొకదాని నొక్కంటి నతుకుచు నతి విచిత్రగతి విరచింపని విరచనమునకు విలువ యిచ్చుట చెరువులోని కలువల నన్నింటిని గలుపుచు నొకే నీరతలమ్మున బోషింపకయే కలువనాకలువ నొకానొక ముంతొడు నీళ్ళలో మొలిపించుట వంటిదిగాదే!

... ... ... ... ...

## నిశ్చింత

పూర్వం రెండవతరగతి బండియే ఇప్పటి మొదటితరగతి బండి అని అనుకుంటూ రెండు గీతల్లోంచి ఒకగీత కొట్టెయ్యగా నిల్చివున్న ఒక గీతగల పరుపులపెట్టె ఎక్కాడు సుందరరావు. రైలు అసలు మెయిలు. అందులో ఇది పరుపులపెట్టె! మంచి టీగ్గావుంది. పైనోమూడు "బెర్తులు" క్రిందో మూడు "బెర్తులు" రెండుమూడు "ఫానులు" ఆ వరుసనే "లైట్లు" ఒక మేజాబల్ల, బూడిదదులుపుకునే 'ట్రే'లు, అద్దం నీళ్ళుగల "లావెటరీ" వీటన్నిటితోటి ఆ పెట్టె ఏలావుంది? 'అప్సరస' మినహా స్వర్గతుల్యంగావుంది. అప్సరస రావడానికి అది 'మేల్‌రిసర్వ్' అయినా అప్సరసలకన్న అందం వొలికించే బొమ్మలున్న 'మాగజీ'నులు ఇంగ్లీషుని తమిళానివి హిందీని ఆ పెట్టెలో వున్నాయి! ఎలా వచ్చాయి ఇన్ని మాగజీనులు అని అడుగుతారేమో!అది మెయిల్‌గాడీ!హౌరానుండి మదరాసుదాకా పోయేది! కూర్చున్నమనుష్యులుకూడా కలకత్తానుండి కొందరు, వాల్తేరునుండి కొందరు ప్రయాణిస్తూ వున్న